

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం

29 సెప్టెంబర్ 2025 పేజీలు : 08


# జీఎస్టీ ఫలాలు ప్రజలకు అందాలి

- అక్టోబర్ 16లోపు ఆక్వా రైతులు లైసెన్సులు పొందాలి
- పరిశ్రమలు, పెట్టుబడుల సాధనలో దేశంలోనే అగ్రగామిగా ఏపీ
- వైసీపీ నేతల కలలు, ఊహలు ఫలించే ప్రసక్తే లేదు
- పొదలకూరులో మీడియాతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



పొదలకూరు, మేజర్‌న్యూస్ :

జీఎస్టీ తగ్గింపుతో వచ్చే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూటమి నాయకులపై ఉందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. పొదలకూరు ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం కొన్ని వస్తువులపై అసలు జీఎస్టీ లేకపోగా, కొన్నింటిని 5, 18 శాతం శ్లాబులకు పరిమితం చేయడం జరిగిందన్నారు. ఫలితంగా అనేక రకాల వస్తువుల ధరలు తగ్గుతున్నాయన్నారు. 18 శాతం పన్ను కూడా ఏసీలు, టీవీలు లాంటి ఖరీదైన వాహనాలపైనే ఉందన్నారు. పొగాకు, పాన్‌మసాలా, లగ్జరీ కార్లపైన మాత్రమే 40 శాతం పన్ను విధించారని వివరించారు. పాలు, గుడ్లు తదితర ఆహార పదార్థాలపై జీఎస్టీని తొలగించడం జరిగిందని చెప్పారు. జీఎస్టీ మార్పులు ప్రజలకు అనేక ప్రయోజనాలు కలిగించబోతున్నాయని, వాటిని కూటమి నాయకులు ప్రజలకు వివరించాలని సూచించారు. జీఎస్టీ ప్రయోజనాలు ప్రజలకు అందేలా వ్యాపారులు సహకరించాలని, అమలు తీరును పర్యవేక్షించే బాధ్యత కూటమి నాయకులు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా వ్యాపారులు సహకరించకపోతే అధికారులతో పాటు తమ దృష్టికి

మిగతా 02లో

### పని ఒత్తిడిని జయించేందుకు
## క్రీడలు అవసరం

క్రికెట్ టోర్నీని అట్టహాసంగా ప్రారంభించిన రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి



8లో

### చంద్రబాబు అక్రమ వసూళ్లకు
## రెగ్యులేటరీ కమీషన్ కళ్లెం

- ఈఆర్‌సీ నిర్ణయం ప్రభుత్వానికి చెంపపెట్టు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం

- ఏపీఈఆర్‌సీ అనుమతి లేకుండా విద్యుత్ చార్జీల రూపంలో దోపిడీ
- ప్రజలకు చంద్రబాబు మేలు చేసినట్టు ఎల్లో మీడియాలో కలరింగ్
- విద్యుత్ చార్జీలు పెంచనని ఎన్నికల్లో చెప్పి, ఏడాదిలో రూ. 19 వేల కోట్లు పెంచేశాడు

వివరాలు 2లో



### అన్యాయానికి గురవుతున్న
## వైసీపీ కార్యకర్తలు

కార్యకర్తల కోసం రూపొందించిన డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ




లోపల పేజీలో

## శ్రీవారి మోహిని అవతార ఉత్సవంలో వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు, మేజర్‌న్యూస్ :

తిరుమల క్షేత్రంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఐదో రోజైన ఆదివారం ఉదయం మలయప్పస్వామి మోహిని అవతారంలో దర్శనం కల్పించారు. స్వామివారి వాహన సేవలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు పాల్గొన్నారు. మలయప్పస్వామి అద్భుతమైన మోహినీ అలంకారంలో, సర్వాలంకార భూషితుడై భక్తులను కటాక్షించారు. స్వామివారి పక్కనే మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు కూడా అలంకృతుడై భక్తులకు అభయం ఇచ్చారు. స్వామివారి వాహన సేవను వీక్షించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.





## దుర్గాదేవిగా దర్శనమిచ్చిన
### ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు

నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :

శ్రీ దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 7వ రోజు శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు శ్రీ దుర్గా అమ్మవారి అలంకారంలో భక్తులకు దర్శమిచ్చారు. శ్రీ దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని ఉదయం అమ్మవారికి అభిషేకం, చండీయాగం, సాయంత్రం శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన పూజలు విశేషరీతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలను కనులారా అమ్మవారి కరుణాకటాక్షముల కోసం, వీక్షించుట కోసం విచ్చేసిన భక్తులకు అర్చక స్వాములు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం, సాయంత్రం ప్రసాద వినియోగం, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవోపేతంగా జరిగాయి. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, నూతన ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

# చివరి వినియోగదారుని వరకు జీఎస్టీ ఫలాలు అందాలి

- వ్యాపారులందరూ తప్పకుండా జిఎస్టీ 2.0ను అమలు చేయాలి
- ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు
- వినియోగదారుల ఫిర్యాదుల కోసం 1915 టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు
- 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ప్రజలకు మేలు చేయాలనే గొప్ప లక్ష్యంతో ప్రభుత్వాలు తీసుకొచ్చిన జిఎస్టీ 2.0 ఫలాలు చివరి వినియోగదారుని వరకు అందించడం మనందరి సామాజిక బాధ్యత అని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. ఆదివారం ఉదయం నెల్లూరు నగరంలోని ట్రంకురోడ్డులో గల లలిత కన్వెన్షన్ సెంటర్‌లో నెల్లూరు చార్టెడ్ అకౌంట్స్, ట్యాక్స్ బార్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో జిఎస్టీ 2.0 సూపర్ జిఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో లంకా దినకర్ మాట్లాడుతూ.. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వాలు అమలుచేస్తున్న జిఎస్టీ సంస్కరణలను వారికి సంపూర్ణంగా అందించడం సామాజిక, నైతిక బాధ్యతగా ఆయన చెప్పారు. వ్యాపారులు, ఆడిటర్లు, అధికారులు, ట్రేడ్ యూనియన్లు అందరూ సమన్వయంతో జిఎస్టీ ఫలాలు ప్రజలకు చేరువ చేయాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ సాధనే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 56వ జిఎస్టీ కౌన్సిల్ సమావేశంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టి ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. నాలుగు రకాలుగా ఉన్న పన్ను విధానాన్ని కేవలం రెండు రకాల కే పరిమితం చేశారని, దీంతో 90శాతం మంది ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. అన్ని వస్తువుల ధరలు అందుబాటు ధరల్లోకి వచ్చినట్లు చెప్పారు. ఈ ఆర్థిక వెసులుబాటును ప్రతిఒక్కరికి అందించాలన్నదే ప్రభుత్వాల లక్ష్యమన్న లంకా దినకర్, వ్యాపారులు జిఎస్టీ సంస్కరణల అమలులో నిబంధనలు ఉల్లంఘిస్తే యాంటి ప్రాఫిటింగ్ చట్టం ప్రకారం కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. వస్తుసేవలకు సంబంధించి క్రయవిక్రయాలపై వినియోగదారుల ఫిర్యాదుల కోసం 1915 టోల్‌ఫ్రీ నెంబరును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సీఎం చంద్ర బాబు ఆదేశాల మేరకు సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్‌పై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. జిఎస్టీ 2.0 వలన రాష్ట్ర ప్రభుత్వానికి 8 వేల కోట్ల వరకు ఆదాయం తగ్గుతున్నా కూడా ప్రజలకు మేలు చేకూర్చేందుకు ఆ నష్టాన్ని భరిస్తూ జిఎస్టీని అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు ముందుకొచ్చారన్నారు. శాసన సభలో కూడా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన మొదటి సీఎం చంద్రబాబు అని కొనియాడారు. 2047 స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే సూపర్‌సిక్స్ హామీలను విజయవంతంగా అమలు చేశారని, ఇదే స్ఫూర్తితో జిఎస్టీ ఫలాలు ప్రజలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు లంకా దినకర్ చెప్పారు. సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వ్యాపారులు, చార్టెడ్ అకౌంటెంట్లతో జిఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జిఎస్‌టి జాయింట్ కమిషనర్ వై కిరణ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ ఎం.సత్యప్రకాష్, నెల్లూరు చార్టెడ్ అకౌంట్స్ అసోసియేషన్ చైర్‌పర్సన్ యస్.హిమహాసిని, ట్యాక్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వివిఎంవి సుబ్బారావు, కందుకూరు సత్యనారాయణ, పలువురు వ్యాపారులు, చార్టెడ్ అకౌంటెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ ఫలాలు ప్రజలకు అందాలి

(మొదటి పేజీ తరువాయి)



తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అనేక ప్రయోజనాలు కలిగిస్తోందని చెప్పారు. అక్టోబర్ 4న ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం ద్వారా రూ.15 వేలు చొప్పున అందించబోతున్నామని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఈ ప్రయోజనాలు అందిస్తామని తెలిపారు. చేపలు, రొయ్యలు రైతులు కచ్చితంగా ఆక్వా అథారిటీ వద్ద లైసెన్సులు పొందాలన్నారు. ఆ లైసెన్సు ఉంటేనే ప్రభుత్వ ప్రయోజనాలు, విద్యుత్ చార్జీల సబ్సిడీలు అందుతాయని గుర్తుంచు కోవాలన్నారు. అక్టోబర్ 16వ తేదీలోపు ఆక్వా సాగు చేస్తున్న రైతులందరూ లైసెన్సులు పొందాలని సూచించారు. సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలపై అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సంబంధిత మంత్రులకు దృష్టికి తీసుకుపోవడం జరిగిం దన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడంలో రాష్ట్రంలోనే సర్వే పల్లి నియోజకవర్గం ముందుందన్నారు. త్వరలోనే టీపీ గూడూరు మండలంలోనూ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటి వరకు 2600 గిరిజన కుటుంబాలకు ఆధార్ కార్డులు ఇప్పించామని వారికి రేషన్ కార్డులతోపాటు ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు పొందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల కోసం సంక్షేమ పథకాలు అమలు చేయడంలోనూ, పరిశ్రమలు, పెట్టుబడులు సాధించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. డీఎస్సీ ఉద్యోగాల నియామక పత్రాలు అందించే ప్రక్రియ పండగ వాతావరణంలో కొనసాగిందని, నియోజకవర్గం నుంచి 43 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందడం సంతోషించదగిన విషయమన్నారు. సమావేశంలో పిఎసిఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, ఏఎంసి వైస్ చైర్మన్ వెంపులూరు అరుణ, లఃటిడిపి అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, టిడిపి నాయకులు కలిచేటి ప్రభాకర్ రెడ్డి, పులిపాటి వెంకటరత్నం నాయుడు, ఏఎంసి డైరెక్టర్లు కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, అక్కెమ్ సుధాకర్ రెడ్డి, బోగోలు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

# చంద్రబాబు అక్రమ వసూళ్లకు రెగ్యులేటరీ కమీషన్ కళ్లెం

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** తన అనుమతి లేకుండా విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపి నందుకు ప్రభుత్వానికి ఏపీఈఆర్‌సీ తలంటితే సిగ్గుపడాల్సిందిపోయి ట్రూ డౌన్ పేరుతో విద్యుత్ చార్జీలను తగ్గిస్తున్నట్లుగా ఎల్లో మీడియా ద్వారా చంద్రబాబు ప్రచారం చేసుకోవడం ఆయన దివాలాకోరుతనంకు నిదర్శనమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రూడౌన్ వల్ల వినియోగదారులకు వెనక్కివ్వాల్సిన రూ.923.55 కోట్లను తాను ఎందో ఉదారంగా తగ్గిస్తున్నట్లు చెప్పుకోవడానికి సిగ్గులేదా అని ప్రశ్నించారు. ఆదివారం నెల్లూ రు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను తగ్గిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చిందే కాకుండా, సీఎం అయిన ఏడాదిలోనే ప్రజలపై చంద్రబాబు రూ.19 వేల కోట్ల విద్యుత్ భారం మోపాడని ధ్వజమెత్తారు. కూటమి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో ప్రజల నుంచి అక్రమంగా వసూలు చేసిన మొత్తంలో రూ.923.55 కోట్లను ప్రజలకు వెనక్కి ఇవ్వాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) డిస్కంలను ఆదేశించింది. తమ అనుమతి లేకుండా విద్యుత్ చార్జీల రూపంలో ప్రజల నుంచి అక్రమంగా వసూలు చేయడంతో ఏపీ ఈఆర్‌సీ మొట్టికాయలు వేసిందని దీంతో ప్రభుత్వం వెనక్కి ఇచ్చి తీరాల్సిన పరిస్థితి ఎదురైందని చెప్పారు. అక్రమంగా దోచుకున్న డబ్బును వెనక్కి ఇవ్వడం కూడా ప్రజలకు మేలు చేస్తున్నట్టు ఎల్లో మీడియాలో కలరింగ్ ఇచ్చుకోవడం సిగ్గుపడాల్సిన అంశం అన్నారు. ట్రూ అప్ చార్జీలపై విచారణ జరిపిన విద్యుత్ నియంత్రణ మండలి డిస్కంలు చెప్పిన లెక్కలు, కొనుగోలు వ్యయంలో భారీ వ్యత్యాసం గుర్తించి క్రమంగా వసూలు చేసిన మొత్తంలో రూ.923.55 కోట్లను ప్రజలకు వెనక్కి ఇవ్వాలని ఆదేశించిందన్నారు. అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచనని ఎన్నికల్లో హామీ ఇచ్చి న చంద్రబాబు, కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఏడాదిలోనే విద్యుత్ రూ.19 వేల కోట్లు చార్జీలు పెంచడమే కాకుండా ఏపీ ఈఆర్‌సీ అనుమతి కూడా తీసుకోలేదు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి మాట తప్పిన కూటమి ప్రభుత్వం ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కోరారు. దోచుకున్న సొమ్మును తిరిగివ్వాలని విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశిస్తే దానికి ఎల్లో మీడియా రంగు లద్ది చంద్రబాబుని జాకీలతో పైకి లేపుతోందన్నారు. వైయస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ విద్యుత్ చార్జీలు పెంచి ట్రూఅప్ చార్జీలు వసూలు చేయడం తప్ప, చార్జీలు తగ్గించి ట్రూ డౌన్ చేయడం లేదని, నేడు చంద్రబాబు హయాంలో ట్రూ డౌన్ చేస్తున్నట్టు గొప్ప



ఘనతగా ఎల్లో మీడియా ప్రచారం చేస్తోందని వైయ స్సార్సీపీ హయాంలో ఏనాడూ ఏపీ ఈఆర్‌సీ నిబంధనలను అతిక్రమించి ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపనేలేదని చెప్పారు. ప్రజల నుంచి ఒక్క రూపాయి కూడా లాక్కోవాలని ఆలోచించలేదు కాబట్టే చంద్రబాబులా మొట్టికాయలు తినలేదని చెప్పారు. తప్పు చేసి అడ్డంగా దొరికి పోయి కూడా చంద్రబాబు ప్రజలకు మేలు చేస్తున్నాడని నమ్మించాలనుకోవడం దారుణం అన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ.2,758.76 కోట్లు ఇంధన, విద్యుత్ కొనుగోలు సర్దుబాటు (ట్రూ అప్) చార్జీలను డిస్కంలు ఈ ఏడాది జూలైలో ప్రతిపాదించాయని, ఇందుకు ఏపీఈఆర్‌సీ నుంచి అనుమతి కోరగా వీటిపై విచారణ జరిపిన ఏపీ ఈఆర్‌సీ డిస్కంలు చెప్పిన లెక్కలు, విద్యుత్ కొనుగోలు వ్యయంలో భారీ వ్యత్యాసాన్ని గుర్తించిందన్నారు.. డిస్కంలు అడిగిన దానికి యథాతథంగా ఆమోదం తెలప కుండా రూ.895.12 కోట్లు తగ్గించి రూ.1,863.64 కోట్లకు మాత్రమే అనుమతి నిచ్చిందని వివరించారు. అలాగే గత ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో విద్యుత్‌ను అధిక ధరలకు కొనుగోలు చేసిందంటూ తప్పుడు ప్రచారం చేసిన కూటమి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఏపీ ఈఆర్‌సీ అనుమతించిన దానికి మించిన ధరకు విద్యుత్ కొనుగోలు చేసిందని ఏపీ ఈఆర్‌సీ యూనిట్‌కు రూ.5.27కు కొనమని చెబితే ఈపీడీసీఎల్ యూనిట్ రూ.5.84 చొప్పున, సీపీడీసీఎల్ రూ.5.86 చొప్పున, ఎస్పీడీసీఎల్ యూనిట్ రూ.5.89 వెచ్చించి విద్యుత్ కొన్నట్టు ప్రతిపాదనలో తెలిపాయి. విద్యుత్ కొనుగోలు ఖర్చు కూడా రూ.34,517 కోట్లకు అనుమతి ఉంటే రూ.45,476 కోట్లు వెచ్చించామని డిస్కంలు చెప్పాయన్నారు. ఇందులో రూ.44,624 కోట్లకు ఏపీ ఈఆర్‌సీ ఆమోదం తెలిపిందని ప్రసార, పంపిణీ (ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్) నష్టాలు 10.17 శాతమని డిస్కంలు ప్రతిపాదిస్తే ఈఆర్‌సీ మాత్రం 9.87 శాతానికే అంగీకరించిందని పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతి నెలా యూనిట్‌కు రూ.0.40 పైసలు చొప్పున అదనంగా డిస్కంలు వసూలు చేశాయని ఇందులో ఎస్పీడీసీఎల్ రూ.1,106.56 కోట్లు, సీపీడీసీఎల్ రూ.614.86 కోట్లు, ఈపీడీసీఎల్ రూ.1,065.76 కోట్ల చొప్పున ఇప్పటికే రూ.2,787.18 కోట్లు వసూలు చేసేశాయని ఈ మొత్తం నుంచి అనుమతించిన రూ.1,863.64 కోట్లు పోగా మిగిలిన రూ.923.55 కోట్లను ఈ ఏడాది నవంబర్ నెల బిల్లు నుంచి ట్రూ డౌన్ చేయాలని ఈఆర్‌సీ ఆదేశించిందని ఇప్పటికే ప్రజల నుంచి వసూలు చేయాల్సిన దానికంటే అదనంగా వసూలు చేశారని, దానిని 12 సమాన వాయిదాల్లో ప్రతి నెలా విద్యుత్ బిల్లుల్లో యూనిట్‌కు రూ.0.13 పైసల చొప్పున సర్దుబాటు చేయాలని ఆదేశించిందని తెలిపారు. ఈఆర్‌సీ నిర్ణయం ప్రభుత్వానికి చెంపపెట్టు 2024 నవంబర్ బిల్లు నుంచే రూ.6,072.86 కోట్ల భారాన్ని వసూలు చేస్తుండగా ఈ ఏడాది జనవరి బిల్లు నుంచి మరో రూ.9,412.50 కోట్ల అదనపు భారం మోపింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వినియోగదారులకు ఇచ్చే బిల్లుల్లో యూనిట్‌కు రూ.0.40 చొప్పున అదనంగా వసూలు చేయడం ఏడాది ప్రారంభంలోనే మొదలు పెట్టారని చెప్పారు. ఈ ఏడాది మార్చి వరకూ జనం డబ్బును అదనపు చార్జీల పేరుతో దోచేశారని ఆరోపించారు.

కలెక్టర్ గారు..

# మా గోడు మీరైనా పట్టించుకోండి

**వెంగళరావు నగర్ ప్రజలు వేడుకోలు**

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో వెంగళ రావు నగర్‌లో ఉన్న సర్వే నెంబర్2048/బి సుమారు ఆ ప్రాంతంలో 300 ఎకరాలు భూమి ఉన్నది. 1970కు ముందు ఈ భూమి రిజర్వు ఫారెస్ట్‌గా ఉంది. 1970 అక్టోబర్ జీవో నెంబర్ 2024 డి ఫారెస్ట్ అయినది. 1972 ఇందిరా నగర్‌లో 110 ప్లాట్లు పేదలకి ఇందిరాగాంధీ హయాంలో ఇవ్వడం జరిగింది. 1977లో వెంగళరావు నగర్లో విశ్వదయ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీకి 1230 నుండి 1303 వరకు ఇవ్వడం జరిగింది. ఇంట్లో కృష్ణ సింగ్ ఎన్జీవోస్కు 150 ప్లాట్లు మార్కెట్ విలువ అంకణం ఏడు రూపాయలు చొప్పున పట్టించుకోని ఇచ్చారు. 1985 నుండి 87 వరకు మిగిలిన ప్లాట్లు ఇవ్వడం జరిగింది. మిగతా స్థలం ప్రభుత్వ లేఔట్ చేసి 1769 ప్లాట్లు, 29 ఓపెన్ ప్లాట్లు మరల 1769 లో 1977లో 150 ప్లాట్లు మిగతా ప్రభుత్వంలో ఉన్న 300కు పైగా ప్లాట్లు మార్కెట్ విలువ కట్టించుకొని వారికి రిజిస్టర్ చేయబడ్డాయి. దాన్లో ఓపెన్ సైట్ కూడా మార్కెట్ విలువ కట్టించి పట్టాలు కూడా ఇవ్వడం జరిగింది. మిగతా మిగతా ఫ్లాట్ల స్థలం నిరుపేదలకు ఉచితంగా ఇవ్వడం జరిగింది. అప్పటినుండి 2017 వరకు మార్కెట్ విలువ కట్టి వాటికి రిజిస్ట్రేషన్ చేయించారు. అలాగే 2017 అక్టోబర్ తర్వాత మరల ఈ భూమిని డి ఫారెస్ట్‌గా చూపించారు. 2023లో 157.43ఎకరాల రిజిస్ట్రేషన్ కాబడింది. అప్పుడు అసైన్డ్ భూములు కూడా ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేశారు. అప్పటినుండి రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేయడం జరిగింది. ఈ విషయంపై ఆ ప్రాంత ప్రజలు ఎన్నోసార్లు అధికారులకు అర్జీలు, విన్నపాలు చేసినప్పటికీ కూడా ఉన్నత అధికారులు పట్టించుకోవడంలేదని సర్వత్ర విమర్శ. అయితే ఇక్కడ భూములు కొనుక్కొని నివాసం ఉంటున్న వారు వారి కుమారులు పెద్ద చదువులు చదువుటకు, వారి కుమార్తెల వివాహాల కొరకు, ఈ స్థలాలు అమ్మాలన్న, యెవరైనా కొనాలన్నా, బ్యాంకు రుణాలు తీసుకోవాలన్న ఇవి ఎందుకు పనికిరాకుండా నిరుపయోగంగా ఉన్నాయని వాళ్ళు తల్లిదండ్రులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతూ ఉన్నారు. ఈ విషయంపై నెల్లూరు జిల్లా కలెక్టర్ గారు దీనిపై సమగ్ర విచారణ జరిపించి, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ భూములు అప్పట్లో ఎందుకు రిజిస్టర్ అయినవి ఇప్పుడు ఎందుకు రిజిస్టర్ కావట్లేదనేది నిజనిర్ధారణ కమిటీ ద్వారా వారికి న్యాయం చేయాలని ప్రజలు, ప్రజాసంఘాలు, నివాసం ఉంటున్న వారు తమ బాధను గోడును విన్నవించుకుంటున్నారు. కాబట్టి జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని, ఈ వెంగళరావు నగర్ వాసుల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నారు.

# గడప గడపకు దూదేకుల కార్యక్రమం

## జిల్లా అధ్యక్షులు షేక్ సలీమ్



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** గడప గడప దూదేకుల కార్యక్రమంలో భాగంగా కోవూరు నియోజకవర్గం ముదివర్తిలో ఉన్న దూదేకుల కులస్తుల ఇంటికి వెళ్లి, వారి సమస్యలు, తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది కార్పెంటర్లుగా, రైతు కూలీలుగా, చిన్న చిన్న కిరాణా షాపులు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కుల సర్టిఫికెట్‌ల సమస్యను పరిష్కరించుటకు గడప గడపకు కార్యక్రమం సందర్భంగా వారికి దూదేకుల సంఘం తరపున కుల సర్టిఫికెట్ అందచేస్తామని లేని వారు తప్పని సరిగా కుల సర్టిఫికెట్ పొందాలని తద్వారా మన దూదేకుల జనాభా ఎంత ఉందో తెలుస్తుందని తెలియజేశారు. ముదివర్తి గ్రామంలో 130 దూదేకుల కుటుంబాలు నివసిస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికలలో దూదేకులకు బీసీ కోటాలో అవకాశం కల్పించాలని, కోరుచున్నాము. రాష్ట్రంలో 20లక్షల మంది దూదేకుల కులస్తులు ఉన్నారని కానీ ప్రభుత్వ లెక్కలలో కేవలం 452000 మాత్రమే ఉన్నారని, అలాగే కోవూరు నియోజకవర్గంలో దాదాపు 3000 నుండి 4000 మంది దూదేకుల కులస్తులు ఉన్నారని వీరందరి వివరాల సేకరించి ప్రభుత్వ అధికారులకు, రాజకీయ నాయకులకు నివేదిక ఇస్తామని తెలియజేశారు. వీరిలో ఎక్కువమంది దూదేకుల కార్పొరేషన్ ద్వారా లోన్ల కొరకు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం త్వరలో దూదేకుల కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చెయ్యాలని కోరుతున్నారు. దూదేకుల సామాజిక వర్గానికి ఏంఎల్‌సిలుగా అవకాశం ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దూదేకుల కులస్తులలో చైతన్యం తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సలీమ్, గౌరవ అధ్యక్షులు షేక్ మహబూబ్ పాషా, ప్రధాన కార్యదర్శి షేక్ మీరా సాహెబ్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి షేక్ షరీఫ్, విడవలూరు మండల అధ్యక్షులు షేక్ నాయబ్, స్థానిక నాయకులు చినిగి షా, నూరుబాషా, కాలేశ, షేక్ నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

# జీవితం సంగీతం లాంటిది

**ఎత్తుపల్లాలు ఉంటాయి ▸ మంచిమాటలో సోమవరపు**




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మానవజీవితం సంగీతం లాంటిదని, సుఖ,దు:ఖాలు, ఎత్తుపల్లాలు ఉంటాయని, అన్నింటిని సమన్వయం చేసుకుంటూ కొనసాగాలని విహెచ్‌పి జిల్లా ఉపాధ్యక్షుడు, తెలుగుభారతిసేవాసమితి గౌరవాధ్యక్షుడు సోమవరపు యానాదిరెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరులో తెలుగుభారతిసేవాసమితి ఆధ్వర్యంలో ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహించే మంచిమాట కార్యక్రమాన్ని ఈఆదివారం నిర్వహించగా వక్తగా సోమవరపు యానాదిరెడ్డి వ్యవహరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పాటలో, లేదా సంగీతంలో సరిగమలు, పల్లవులు, చరణాలు ఉంటాయని, స్వరం తనకున్న ప్రత్యేకత కలిగి ఉంటుందని, అలాగే తమ జీవితంలో ప్రతి అనుభవం కూడా మనకు ఒక కొత్తపాఠం నేర్పుతుందని ఆయన పేర్కొన్నారు. బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం ఈప్రతి దశ ఒక కొత్త స్వరంలాంటిదేనని, మన జీవిత సరిగమలు మధురంగా ఉండాలంటే సహనం, పట్టుదల, కృషి తప్పనిసరి అని ఆయన అభిప్రాయపడ్డారు. విజయాన్ని అందుకోవడానికి ఆత్మనిబ్బరం అవసరమన్నారు. అపజయాలను ఒడిగట్టే స్థైర్యం కలిగి వాటిని ఎదుర్కొనగలిగితే మన జీవితం మధురగానం అవుతుందని యానాదిరెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో తెలుగుభారతిసేవాసమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, ప్రధానకార్యదర్శి అన్నపురెడ్డి పెద వెంకటరెడ్డి, గౌరవాధ్యక్షుడు అంకినపల్లి గోవిందరెడ్డి, సహాధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వర్లు, గౌరవసలహాదారులు ఎస్.వి.రమణయ్య, కె.వి.శేషారెడ్డి, వెలిశెట్టి నారాయణరావు, ఆర్థిక కార్యదర్శి ఒమ్మిన సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు రామయ్యస్వామి, టి.సి.వి.సుబ్బయ్య, ఓంకారం శ్రీనివాసులు, రాజు, ప్రచారకార్యదర్శి కలిశెట్టి రవీంద్రకుమార్, సమితి, ప్రతినిధులు సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, సమితి కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మరమ్మత్తులకు గురైన చేతి పంపు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండలంలోని తిప్పిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోగల, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రానికి ఎదుట నిర్మించిన బోరు ప్రస్తుతం మరమ్మత్తుకు గురై నిరుపయోగంగా మూలన పడింది. దీంతో అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం వండి పెట్టేందుకు ఇబ్బందులు కరెంటు ఉన్న సమయంలో అయితే మోటర్ వేసుకోవడం జరుగుతుందని కరెంటు లేని సమయంలో ఇబ్బందులు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. మెయిన్ రోడ్డు పక్కనే ఉన్నటువంటి వాటికే ఇటువంటి పరిస్థితి ఉంటే పల్లెలలో మరి ఏ విధంగా పట్టించుకుంటారో ఇట్టే తెలుస్తుంది ఎప్పటినుంచో నిరుపయోగంగానే ఉందని గ్రామస్తులు అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మత్తు చేపట్టి వినియోగంలోకి తీసుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కవి చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతి




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** కళా ప్రపూర్ణ, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా కెవిపిఎస్, ప్రజానాట్య మండలి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నెల్లూరులోని కెవిపిఎస్ ఆఫీసులో గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి జి.శేషయ్యలు మాట్లాడుతూ.. కుల వివక్షకు అంటరానితనానికి వ్యతిరేకంగా తన కలాన్ని ఆయుధంగా చేసుకుని, గబ్బిలం, పిరదౌసి, లాంటి రచనల ద్వారా సమాజంలోని అంతరాణితనాన్ని, అసమాన తలను చీల్చి చెంగాడాడని అన్నారు. ఎక్కడైతే అవమానింపబడ్డాడో వారి చేతనే గండ పెండేరాన్ని తొడి గించుకొని ఏనుగు అంబారి పై ఊరేగిన మహాయుడని కొనియాడారు. అలాంటి మహనీయుని ఆదర్శంగా తీసుకొని ఈనాటి కులవ్యవక్షకు అసమానతలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్, ప్రజానాట్యమండలి నాయకులు నూకల పాటి మోహన్, పి.విజయకుమార్, డాల్ శ్రీధర్, కన్నయ్య, కే.జాన్, వీరేంద్ర, సుధాకర్, ఎం.సింహగిరి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## చిరస్మరణీయులు గుర్రం జాషువా, భగత్ సింగ్



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** తన కవిత్వాన్ని ఆయుధంగా తీసుకొని సమాజంలోని మూఢాచారాలపై తిరగబడి, ఛీత్కారాలు ఎదురైన చోటనే సత్కారాలు పొందిన కవి దిగ్గజం, కవి కోకిల విశ్వ కవి సామ్రాట్, నవ యుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా, స్వాతంత్ర సమరయోధుడు విప్లవ వీరుడు, ప్రఖ్యాత ఉద్యమకారుడు, ఢిల్లీ వీధుల్లో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్యపరిచి, విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని పలికించిన ధైర్యశాలి భగత్‌సింగ్ జయంతి కార్యక్రమాలను మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథ బాండా నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి జీవిత విశేషాలను ఆయా రంగాలలో వారు చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కవికోకిల గుర్రం జాషువా 130వ జయంతి ఉత్సవాలు

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో కవి కోకిల గుర్రం జాషువా 130వ జయంతి ఉత్స వాలు ఘనంగా జరిగాయి. బిజెపి జిల్లా అధ్య క్షులు వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షు లు కాపు రామచంద్రారెడ్డి హాజరై జాషువా గారి సాహిత్య విశిష్టతలను ప్రస్తావించారు. ఈ కార్య క్రమంలో రచయితలు, కవులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గంగిశెట్టి శివకుమార్ జాషువా జీవితం, వారి కవిత్వం ద్వారా సమాజం లో సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి గురించి వివరించారు. జిల్లా రచయి తల సంఘ ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ జాషువా రచనలలో స్త్రీ విమోచన ఆలోచనలు, దళితుల పట్ల ఉన్న సానుభూతి గురించి చెప్పగా, పెన్నా రచయితల సంఘ గౌరవ అధ్యక్షులు



శ్రీధర్ బాబు జాషువా కవిత్వంలోని భక్తి, సమాజ సవరణ భావజాలాన్ని వివరించారు. రచయిత తేటమల్ల వెంకటప్పయ్య జాషువా సాహిత్యం లోని స్వచ్ఛమైన తెలుగు శైలిని, శ్రామిక వర్గాల కష్టాలను ప్రతిబింబించిన అంశాలను ప్రస్తావిం చగా, విశ్రాంత సీనియర్ లెక్చరర్ పోలవరపు లక్ష్మీ నరసింహారావు జాషువా స్ఫూర్తిదాయకమైన పద్యాలు, కవిత్వం ద్వారా వచ్చిన సామాజిక చైతన్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో రచయితలు, విశ్రాంత ఉపాధ్యాయులు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సౌత్ మోపూర్‌లో ధాన్యాన్ని పరిశీలించిన రైతు సంఘం



- ఒక ఎకరాకు దాదాపు 10వేల నుండి 15వేలు వరకు నష్టపోతున్న రైతులు
- ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్ గ్రామంలో రాష్ట్ర కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య ఆధ్వర్యంలో ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడగారు సీజన్‌లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వలన రైతులు, కౌలు రైతులు ఒక ఎకరాకు దాదాపు 10వేల నుండి 15వేలు వరకు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని తెలియజేశారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా ఈ లేట్ ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 3లక్షల నుండి మూడున్నర లక్షల వరకు సాగు చేయడం జరిగింది. అలాగే దాదాపు లక్షల మెట్రిక్ టానులో ధాన్యాన్ని పండించిన రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ మేనమేషాలు లెక్కేస్తుందని తెలియజేశారు. అదేవిధంగా మా రైతు సంఘం తరఫున వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ నిర్ణయించిన మద్దతు ధర రైతులకు కేటాయించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కీలుకుప్ప రాజగోపాల్, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కండే శివప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.కె షాన్ వాజ్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పముజుల హరి, సౌత్ మోపూర్ గ్రామ కౌలు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మంత్రి నాదెండ్లను కలిసిన ఆత్మకూరు జనసేననేత శ్రీధర్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మాత్యులు, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాలకమిటి చైర్మెన్ నాదెండ్ల మనోహర్‌ను ఆదివారం ఆత్మకూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ కలిశారు. ఈసందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గంలో జనసేన పరిస్థితి, పార్టీని మరింతగా బలోపేతంచేసేందుకు అనుసరిస్తున్న విధానాలు, కూటమి ప్రభుత్వ సంక్షేమపథకాలపట్ల ప్రజల్లో ఉన్న సంతృప్తి తదితర అంశాలగురించి వారు సుదీర్ఘంగా చర్చించారు. అన్నింటిని శ్రీధర్ మంత్రి నాదెండ్ల దృష్టికి తీసుకెళ్ళారు. ఆత్మకూరు నియోజకవర్గంలో సమస్యలు, ప్రజావసరాలను గురించి కూడా శ్రీధర్ వివరించి హామీలు పొందారు. గత ఐదేళ్ళుగా ఆత్మకూరు నియోజకవర్గంలో చేసిన ఆందోళనాకార్యక్రమాలు, పాదయాత్రలు, నిరాహారదీక్షలు తదితరాల గురించి కూడా చర్చించుకున్నారు. ఈకార్యక్రమంలో నెల్లూరు సిటి జనసేన అధ్యక్షుడు




సుజయ్‌బాబు, నాయుడుపేట వ్యవసాయమార్కెట్‌కమిటీ చైర్మెన్ ఉయ్యాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




# జీఎస్టీ 2.0పై అవగాహన

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ పరిధిలోని 28, 29 డివిజన్ పరిధిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజా నాయుడు ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0పై వ్యాపారులు, స్థానిక ప్రజలకు ఆదివారం సాయంత్రం అవ గాహన కల్పించారు. జిఎస్టి 2.0 ద్వారా సామాన్యుడికి కొనుగోలు శక్తి మరింత పెరుగుతుందన్నారు. అనేక వస్తువులపై ధరలు కూడా తగ్గాయ న్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చెక్క సాయి సునీల్, రఘు రామయ్య, మునిశేఖర్ నాయుడు, జిలాని, మౌలాలి లు పాల్గొన్నారు.

## బండాసురవధ అలంకారంలో శ్రీఅన్నపూర్ణాదేవి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలో వెలసి యున్న శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వ రాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్స వాల్లో భాగంగా ేడవరోజైన ఆదివారం కోలా హలంగా వైభవంగా కార్యక్రమాలను నిర్వహిం చారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మేళ్ళచెరువు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు, అభిషే కాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు బండాసురవధ అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. శివకుమార్‌శర్మ(శివయ్యస్వామి) ఆధ్వర్యంలో అమ్మవారికి పీఠార్చనపూర్వక సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చనను, తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికంగా పాల్గొనగా మహిళా భక్తులు మరింతగా పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మేళ్ళచెరువు సంతోష్‌కుమార్‌స్వామి, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అన్యాయానికి గురవుతున్న వైసీపీ కార్యకర్తలు

- డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** వై.యస్.ఆర్ సీపీ అధినేత వై.యస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ కార్యాలయం నందు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి 'డిజిటల్ బుక్' క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, నెల్లూరు జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నెల్లూరు రూరల్ మండలం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చింతాలమ్మ, అంకాలమ్మకు ప్రత్యేక పూజలు



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అనంతసాగర మండ లం లింగంగుంట గ్రామం లోని చింతాలమ్మ, అంకాలమ్మ దేవస్థానంలో ఆరవ రోజున దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉభయకర్తలుగా పాతశెట్టి నరసింహులు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. చింతాలమ్మ, అంకాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాపిశెట్టి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా 105వ వార్షికోత్సవ వేడుకలు



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరంలోని సెంటినరి తెలుగుబాప్టిస్ట్ చర్చ్ 105వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 27వ తేది సువార్త సభ,28వ తేదిన వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. మొదటి రోజు పల్లవోలు ప్రభాకర్ ఫ్యామిలీ భోజనం ఏర్పాటు చేశారు. రెండవ రోజున సడ్డా రవీంద్ర రెడ్డి, బత్రేడ్డి జనార్ధన్ రెడ్డిభోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చర్చ్ కమిటీ సభ్యులు పరిమి హరీష్, పెనగలూరు సంజయ్, కాకుమూరు సాగర్, సడ్డా కృష్ణ తేజా, అధిక సంఖ్యలో క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

# జడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రం లోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఈదురు ఈశ్వరమ్మ జడ్పీ హైస్కూల్ నందు ఆదివారం పూర్వ విద్యార్థిని విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఘనంగా జరిగింది. హైస్కూల్లో 1994-95 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థిని విద్యార్థులు 30 సంవత్సరాల తర్వాత విద్యార్థుల మధ్య ఉన్న బంధాన్ని గుర్తు చేసుకుంటూ అపూర్వమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టి విజయవంతమయ్యారు. సుదీర్ఘకాలం తర్వాత చదువు చెప్పిన గురువులను ఆహ్వానించారు. విద్యార్థుల బృందమంతా స్కూలుకు చేరుకుని మొదట చదువుల తల్లి సరస్వతి దేవి విగ్రహానికి పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమం ప్రారంభం ముందు గురువుల చేత జ్యోతి వెలిగించారు. అదేవిధంగా కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. గురువులను గౌరవ మర్యాదలతో వేదిక పైకి ఆహ్వానించారు. వారితో పాటు స్కూలు ఎస్ఎంసి చైర్మన్ ధరణి హాజరయ్యారు. ఎంతో ఘనంగా జరిగిన ఈ



కార్యక్రమంలో గురువులను ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. అదేవిధంగా పూర్వ విద్యార్థిని విద్యార్థులకు కూడా ఆత్మీయ సన్మానం జరిగింది. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విచ్చేసిన గురువులు మాట్లాడారు. చాలా కాలం తర్వాత పూర్వ విద్యార్థులు చదువు చెప్పిన ఉపాధ్యాయులను గుర్తు పెట్టుకుని సాంప్రదాయబద్ధంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ గురువుల ఆశీస్సులు తీసుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. జీవితంలో క్రమశిక్షణతో ఉంటూ ముందుకు సాగాలని గురువులు తెలియజేశారు. పిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తదుపరి ఆటలు, పాటల కార్యక్రమాలు జరిగినాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థుల బృందం తదితరులు పాల్గొన్నారు.

### దళితులు, గిరిజనుల జీవితాల్లో..

# వెలుగులు నిండాలని ఆకాంక్షించిన సోమిరెడ్డి



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలం చవటపాళెం ఎస్సీ కాలనీలో శ్రీ పుట్టాలమ్మ తల్లిని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఆయన్ను ఆత్మీయంగా స్వాగతం పలికారు. పుట్టాలమ్మ ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలని, ముఖ్యంగా దళితులు, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన సోమిరెడ్డి, రాష్ట్ర కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలోనే అత్యధికంగా రూ.4 వేల సామాజిక పింఛన్ అందిస్తున్నామని వివరించారు. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకల్లో కేవలం రూ.1000 పింఛన్ ఇస్తుంటే, ఏపీలో ఏటా రూ.33వేలకోట్ల వ్యయం చేసి పింఛన్లు అందజేస్తున్నామన్నారు. అలాగే, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, రైతులకు పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20వేల సాయం అందిస్తున్నామని గుర్తుచేశారు. అక్టోబర్ 4న ఆటో డ్రైవర్లకు రూ.15వేలు చొప్పున అందించనున్నట్టు తెలిపారు. ఇటీవల డీఎస్సీలో 1600 మందికి పైగా మాదిగ వర్గానికి చెందిన అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందారని, ఇది ఎస్సీ వర్గీకరణ వల్ల సాధ్యమైందని ఆయన తెలిపారు. పక్కా ఇళ్ల విషయంలోనూ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం ఇళ్ల మంజూరు మొత్తాన్ని తగ్గించిందని విమర్శించిన ఆయన, ఇప్పుడు చంద్రబాబు మళ్లీ ఎస్సీ, బీసీలకు రూ.2.30 లక్షలు, గిరిజనులకు రూ.2.55లక్షలు మంజూరు చేస్తున్నారని వివరించారు. ఇళ్లు లేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సొంతింటి కల నెరవేర్చుకోవాలని సోమిరెడ్డి పిలుపునిచ్చారు.

# రౌడీషీటర్లకు, నేర చరిత్ర కలిగిన వారికి కౌన్సిలింగ్

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లకు, నేర చరిత్ర కలిగిన నేరస్తులకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ముఖ్యంగా జిల్లా ఎస్పీ ప్రజాశాంతికి భంగం కలిగిస్తే సహించేది లేదని, ఎవరిని ఉపేక్షించమని, పద్ధతులు మార్చుకొని చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అంతేకాకుండా ప్రస్తుతం ప్రజలకు పలు హెల్ప్ లైన్లు అందుబాటులో ఉన్నాయని, రౌడీయిజం చేస్తే నిమిషాల్లోనే తమ దృష్టికి చేరుతుందని అందుకు తగ్గట్టుగానే పోలీసుల ప్రతి చర్యలు కూడా అదే స్థాయిలో ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారు. అదేవిధంగా జిల్లాలోని పోలీస్ అధికారులు ఆయా పరిధిలోని స్టేషన్లలో రౌడీ షీటర్లకు జిల్లా ఎస్పీ నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సాధించారని తెలియజేశారు. వాటిని అరికట్టే విధంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, మహిళ, బాలికలపై, అత్యాచారాలకు వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రౌడీ, కేడి, కదలికలపై పటిష్ఠ నిఘ ఉంటుందని,ప్రజాశాంతికి ఏమాత్రం భంగం కలిగిస్తే పీడీ యాక్ట్‌లు ఓపెన్ చేస్తామని అంతేకాకుండా నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలని వారిని హెచ్చరించారు. అదేవిధంగా నేరాలకు పాల్పడి జీవితాలు సర్వనాశనం చేసుకోవద్దని




తెలియజేశారు. ప్రతి నేరస్తుడిపై పటిష్ఠ నిఘా నిరంతరం ఉంటుందని నేర ప్రవర్తనను మానుకొని ప్రజలతో సహేతుకంగా మెలుగుతూ ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా జీవించాలని సూచించారు. అనంతరం ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. ఎవరైనా తమ ప్రాంతంలో ఏదైనా అల్లర్లు గొడవలు జరిగితే వెంటనే సదరు సమాచారాన్ని డయల్ 112కి గాని దగ్గర్లోని పోలీస్ స్టేషన్ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

## శ్రీ చండీగా భువనేశ్వరి దేవి



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేటలో వెలసియున్న శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి ఆలయం నందు శ్రీ దేవి శరన్నవరాత్రుల సందర్భంగా ఆదివారం ఉదయం నవావరణ పూజ జరిపారు. అమ్మవారి ఆలయంలో విశేషంగా పుష్పాలంకరణ చేశారు. ఉదయం చండీ హెూమం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి 7గంటలకు శ్రీ భువనేశ్వరి శ్రీ చండీ అమ్మవారి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి సంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి అలంకారం కార్యక్రమంకు ఉభయకర్తలుగా కీర్తిశేషులు చిట్టూరు చంద్ర శేఖర్ గుప్తా జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు వ్యవహరించారని కార్యనిర్వహణాధికారి అర్వ భూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

## శ్రీ ధనలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి దేవి



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ధనలక్ష్మి అలంకారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా జరుగుతుంది. ఈ అలంకారం ప్రతి ఏటా నెల్లూరు వాసులకు, భక్తులకు ఒక కన్నుల పండుగగా ఉంటుంది. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి ఆలయంలో పుష్పాలంకరణ అత్యంత వైభవంగా చేశారు. ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు విశేషంగా తరలి వచ్చారు.

## శ్రీమహాలక్ష్మిదేవిగా జ్వాలాముఖి అమ్మవారు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ఉత్తరబలిజవీధిలో వెలసియున్న శ్రీశ్రీశ్రీ జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో సోమవారం శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏడవ రోజు ఆదివారం ఉదయం 6గంటలకే మంగళ వాయిద్యాలతో తోరబంధన, గణపతిపూజా, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, జ్వాలాముఖి అమ్మవారి మంగళస్నానం, విశేష అభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవిఖడ్గమాల విశేషపూజలు, మహిళలతో పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని శ్రీమహాలక్ష్మిదేవి అలంకారంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా సుసర్ల నాగరాజు సునందలక్ష్మి, చలంచర్ల శ్రీనివాసులు-సునీత, కొలగాని అమ్మణ్ణమ్మలు వ్యవహరించారు. ఉభయకర్తల ఇంటివద్ద నుండి భాజా భజంత్రీలు, బాణాసంచాలతో ఊరేగింపుగా ఉభయాన్ని ఆలయానికి చేర్చారు. ఆలయ ప్రధానఅర్చకులు పి.శివకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించగా భక్తులు అధికంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పర్యవేక్షించారు.

## అన్నపూర్ణాదేవికి అపూర్వవిశేషాభిషేకం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో వెలసియున్న శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వరాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన ఆదివారం అమ్మవారికి అపూర్వ, విశేష, అరుదైన అభిషేకం గావించారు. ఏడాదికొకదపా మాత్రమే ఈ అభిషేకం జరుగుతుంది. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మేళ్ళచెరువు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో పంచామృత సుగంధ ద్రవ్యసహితగంగాదిసర్వతీర్థ రాజాతీర్థములతో నక్షత్ర కలశములతో విశేషాభిషేకం చేశారు. నక్షత్రపంచహారతి మహానివేదనం కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. భక్తులు అధికంగా పాల్గొని ఈ విశేషాభిషేకం కార్యక్రమాన్ని తిలకించారు. ఏడాదికొక దపా మాత్రమే అమ్మవారికి ఈవిశేష అబిషేకం జరుగుతుందని, అమ్మవారి కరుణాకటాక్షాలు లభిస్తాయని భక్తుల అపారవిశ్వాసం. ఈకార్యక్రమాన్ని శివకుమార్‌శర్మ (శివయ్యస్వామి) ప్రత్యేకంగా నిర్వహించారు. అర్చకులు మేళ్ళచెరువు సంతోష్‌కుమార్‌స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని సందర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# నేడు ఆత్మకూరులో లోక్‌కళ్యాణ్ మేళా : కమీషనర్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం ఒక కుటుంబం ఒక వ్యాపారవేత్తలో భాగంగా పట్టణపేదరిక నిర్మూలనాసంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంవద్ద సోమవారం ఉదయం 11గంటలకు లోక్‌కళ్యాణ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆత్మకూరు మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్ పేర్కొన్నారు. ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో జరిగే ఈమేళా సందర్భంగా వీధివిక్రయదారులు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా ఉచిత వైద్యశిభిరం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ మేళాలో పిఎంఎస్‌విఏ నిధి-2 పథకానికి కొత్తగా దరఖాస్తులు స్వీకరించడం, ఇప్పటికే మంజూరుకాబడిన దరఖాస్తుల రుణపంపిణీని సులభతరం చేయడం, బ్యాంకులు తిరిగిపంపిన



క్యాటగిరిక్రింద యుఎల్‌బివద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాసెస్ చేయించడం, లబ్ధిదారులకు డిజిటల్ ఆన్ బోర్డింగ్ అవగాహన కల్పించడం, ఎఫ్ఎస్ఎస్ఏఐ సమన్వయంతో వీధి ఆహార విక్రేత లబ్ధిదారులకు శిక్షణ నిర్వహించడం, సామాజిక ఆర్థిక ప్రొఫైలింగ్ చేపట్టడం, తొలగించబడిన లబ్ధిదారులు మరియు వారి కుటుంబాలకు లోన్ మంజూరు చేయించడం తదితరాలను ఈకార్యక్రమంలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. పురపాలకసంఘ పరిధిలోని బ్యాంక్ మేనేజర్లు, లేబర్ డిపార్ట్‌మెంట్, సివిల్‌డిపార్ట్‌మెంట్, హెల్త్‌డిపార్ట్‌మెంట్, ఫుడ్‌సెక్యూరిటి డిపార్ట్‌మెంట్, ఐసిడిఎస్ డిపార్ట్‌మెంట్‌ల ప్రతినిధులు, టౌన్‌వెండింగ్ కమిటీ సభ్యులు, వీధివిక్రయదారులు హాజరుకావాలని గంగాప్రసాద్ కోరారు.

## బీఎస్పీ సెక్టార్ అధ్యక్షుడుగా పైసల్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** బహుజన సమాజ్ పార్టీ సంగం మండలం సిద్దీపురం సెక్టార్ అధ్యక్షుడుగా సయ్యద్ పైసల్‌ను నియమించారు. ఈమేరకు ఆదివారం ఆత్మకూరులో నిర్వహించిన పార్టీ సమావేశంలో నాయకులు ప్రకటించారు. బిఎస్‌పి సీనియర్ నాయకుడు చెన్నుపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో జిల్లా అడ్వయిజర్ టి.కృష్ణ, నియోజకవర్గ ప్రధానకార్యదర్శి శేషాద్రి, సంగం మండల ప్రధానకార్యదర్శి చెన్నకృష్ణయ్య, కోశాధికారి నారాయణమూర్తిలు పాల్గొన్నారు. సెక్టార్ నూతన అధ్యక్షుడు పైసల్‌ను వారంతా సన్మానించి అబినందించి పార్టీకండువా కప్పి ఆహ్వానించారు.

# బీజేపీ కూటమిలోనే కొనసాగుతుంది..

- బీజేపీ సీనియర్ నేత వయోవృద్ధుని పొలాలపై టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యం చేయడం అవసరమా?
- సీఎం చంద్రబాబు ఆలోచించాలని ఆవేదన వ్యక్తం చేసిన బీజేపీ నేత మిడతల రమేష్

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం ఏకశిరి పంచాయతీలో దేవారెడ్డి గోపాల్ రెడ్డి 85 గత 50 సంవత్సరాలుగా జనసంఘం బీజేపీ సిద్ధాంతాలకు క్రియాశీలనేత. వృద్ధుడైన గోపాల్ రెడ్డి పొలంలోకి 25మంది టీడీపీ కార్యకర్తలు చట్ట వ్యతిరేకంగా 60 హద్దురాళ్ళ పెకిలించి జెసిబితో ఆయన పొలంలో కాలవ నిర్మించుకున్నారు. సదరు భూమిపై గత ప్రభుత్వంలో పోలీసు రెవెన్యూ అధికారులు చట్ట వ్యతిరేకంగా ప్రత్యక్ష చర్యలకు పూనుకున్నారు. ప్రస్తుతం కూటమిలో టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యం చేసి వయోవృదున్ని ఆయన భార్యను అవమానించారు. వృద్ధురాలైన ఆయన భార్య అడ్డు వెళ్ళిన ఆయన భార్య దౌర్జన్యం చేయొద్దని అడ్డగిస్తే ఆమెను దూషించారు. విలేజ్ మ్యాప్‌లో కాలువ లేదు. 2పాసుబుక్కులలో నమోదైన వివరాలు ప్రకారం తన భూమి మాయమైంది. 3 హైకోర్టు స్టేటస్ కో ఉంది. తిరుపతి ఎస్పీ తిరుపతి కలెక్టర్కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన కనీసం మాట్లాడేందుకు కూడా ఏ అధికారులు స్పందించడం లేదు. పొలాల మధ్య సమస్యలు వస్తే సామరస్యంగా కూటమి సభ్యులు.. అధికారులు కలిసి చర్చించుకోవాలి. అలాకాకుండా బీజేపీ సీనియర్ నేత కుటుంబంపై దౌర్జన్యం చేయడం ఏమిటి? ఆయన తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదులు చేస్తే సంబంధిత అధికారులు ఎవరూ కూడా చట్టాన్ని అమలు చేసేందుకు సిద్ధంగా లేరు.. సిద్ధాంతమే లక్ష్యంగా జీవించిన వయోవృద్ధుని



కుటుంబానికి జరిగిన అవమానంపై దృష్టి సారించి వాస్తవాలు తెలుసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుసుకోవాలని రమేష్ విజ్ఞప్తి చేశారు. ఎక్స్ ద్వారా బీజేపీ నేతకు జరిగిన అవమానాన్ని పాలకులు అధికారులు దృష్టికి రమేష్ తీసుకువెళ్లారు.

# ఆత్మకూరు స్థానిక ఎన్నికలపై చర్చోపచర్చలు ఆరంభం

- రిజర్వేషన్లపై అంచనాలు
- ఆశావహుల్లో ఉత్కంఠత

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఎన్నికల కమీషన్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సమాయత్తం కావాలని ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాయడం, రానున్న జనవరిలోనే ఎన్నికలు జరుగనున్నాయన్న సంకేతాలు వెలువడుతుండడంతో ఆత్మకూరు మండలంలో చర్చలు జోరందుకున్నాయి. ఈదపా మండలాధ్యక్ష పదవి, జెడ్పిటిసి పదవి ఏ క్యాటగిరికి రిజర్వు కాబోతున్నాయి. తమకు అవకాశం దక్కుతుందా లేదా అనే యోచనలు చేసుకుంటుండగా స్థానిక సంస్థలఎన్నికల గురించి చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఈదపా ఎంపిపి, జెడ్పిటిసి మెంబర్ పదవులు జనరల్ అయితే అధికారపార్టీ అభ్యర్థి ఎవరు, బిసి లేదా మహిళ అయితే ఎవరు అనే సమాలోచనలు కూడా జోరుగానే ఉన్నాయి. ఆత్మకూరుకు శాసనసభ్యులుగా ప్రతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆశీస్సులు ఎవరికి లభిస్తాయో అనే చర్చలు కూడా సాగుతున్నాయి.

### ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవులపై చర్చలు

ఆత్మకూరు మండలాధ్యక్ష పదవి గత ఎన్నికల సమయంలో జనరల్ కాగా చెర్లోయడవల్లి ఎంపిటిసి మెంబర్ కేతా వేణుగోపాల్‌రెడ్డి వైసిపి తరపున ఎన్నికకాగా సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన తెలుగుదేశంలో చేరారు. మండల జెడ్పిటిసి సభ్యత్వ పదవి జనరల్ మహిళకాగా వైసిపి తరపున పెమ్మసాని ప్రసన్నలక్ష్మి ఎన్నికై ఆమె అదే పార్టీలో కొనసాగుతున్నారు. ఎంపిపి పదవి గతంలో జనరల్, జెడ్పిటిసిమెంబర్ పదవి జనరల్ మహిళకు రిజర్వేషన్ కావడంతో ఈదపా జనరల్ కాకుండా ఇతర క్యాటగిరిలకు రిజర్వు కానున్నాయి. అప్పారావుపాళెం ఎంపిటిసి సెగ్మెంట్ జనరల్‌మహిళకు కేటాయించగా వైసిపి తరపున పెమ్మసాని వేణమ్మ ఎన్నికై అదే పార్టీలో కొనసాగుతున్నారు. బట్టేపాడు ఎంపిటిసి సెగ్మెంట్ జనరల్ కాగా తెలుగుదేశం తరపున డాక్టర్ తూమాటి శశిధర్‌రెడ్డి ఎన్నికై ఆయన అదేపార్టీలో కొనసాగుతున్నారు. మహిమలూరు ఎంపిటిసి సెగ్మెంట్ ఎస్‌సి జనరల్ కాగా ఉద్దాల పెంచలరావు ఎన్నికై ఉపమంలాధ్యక్షపదవి చేపట్టి ఆయన అదే పార్టీలో కొనసాగుతున్నారు. పడకండ్ల ఎంపిటిసి సెగ్మెంట్ బిసి మహిళకు కేటాయించగా వైసిపి తరపున కంభంశెట్టి ప్రమీల ఎన్నికై ఉపమండలాధ్యక్షపదవి చేపట్టి ఆమె అదే పార్టీలో కొనసాగుతున్నారు. దేవూరు ఎంపిటిసి సెగ్మెంట్ జనరల్ మహిళకు కేటాయించగా వైసిపి



తరపున గడ్డం సుచిత్ర ఎన్నికైన ఆమె అదే పార్టీలో కొనసాగుతున్నారు. మురుగుళ్ళ ఎంపిటిసి సెగ్మెంట్ జనరల్ కాగా బొడ్డు సుభాషిణి వైసిపి తరపున ఎన్నికై అదే పార్టీలో కొనసాగుతున్నారు. వాసిలి ఎంపిటిసి సెగ్మెంట్ జనరల్ మహిళకు కేటాయించగా తెలుగుదేశం తరపున గద్దె ప్రసన్న ఎన్నికై ఆమె అదే పార్టీలో కొనసాగుతున్నారు. కరటంపాడు ఎంపిటిసి సెగ్మెంట్ బిసిలకు కేటాయించగా వైసిపి తరపున ఖాసిమ్‌సాహెబ్ ఎన్నికై కొంతకాలం క్రితం మృతిచెందారు. ఈ 9ఎంపిటిసి స్థానాలు గత ఎన్నికల్లో వచ్చిన రిజర్వేషన్లు కాకుండా రొటేషన్ విధానంలో ఇతర క్యాటగిరిలకు రిజర్వు కానున్నాయి. ఏస్థానం ఎవరికి రిజర్వు అవుతుందన్న చర్చలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. ఆశావహుల్లో మరింతగా ఉత్కంఠత కన్పిస్తోంది.

### సర్పంచ్ పదవుల రిజర్వేషన్లపై ఉత్కంఠత

ఆత్మకూరు మండలంలో 21 గ్రామపంచాయతీలుండగా గతంలో ఏ క్యాటగిరికి రిజర్వుకానున్నాయి, ఆశావహులకనుకూలంగా ఉంటాయా లేదా అనే చర్చలు ఉత్కంఠభరితంగా ఉన్నాయి. మండలంలోని వాశిలి గతంలో ఎస్‌సిమహిళకు కేటాయించగా సర్పంచ్‌గా చెలికారమాహరిబు ఎన్నికయ్యారు. పమిడిపాడు జనరల్ కాగా మాలెపాటి సతీష్‌నాయుడు ఎన్నికయ్యారు. పడకండ్ల బిసిలకు కేటాయించగా మాముడూరు నరశింహులు ఎన్నికయ్యారు. వెన్నవాడ జనరల్ కాగా జగన్నాథం లక్ష్మమ్మ, కరటంపాడు ఎస్సీ మహిళకు కేటాయించగా పూనుగుంట రేవతి, బి.చిరువెళ్ళ బిసిజనరల్ కాగా బొలిగర్ల వెంకటేశ్వర్లు, నారంపేట జనరల్ కాగా కంచర్ల మాధవి, చెర్లోయడవల్లి జనరల్ కాగా, నాగులపాడు జనరల్ కాగా సోమవరపు వెంకటరమణారెడ్డి, రావులకొల్లు జనరల్ కాగా రామిరెడ్డి ఉషారాణి, నువ్వురుపాడు ఎస్సీమహిళకు కేటాయించగా కటారి దొరసానమ్మ, దేపూరు జనరల్ కాగా రావిళ్ళ వెంకటేశ్వర్లు, బండారుపల్లి జనరల్‌మహిళకు కేటాయించగా ఇప్పగుంట రాజేశ్వరి, కనుపూరుపల్లి బిసి మహిళకు కేటాయించగా రాచగొర్ల ఆదిలక్ష్మమ్మ, మురుగుళ్ళ జనరల్ మహిళకు కేటాయించగా పువ్వాడి హరిత, నల్లపురెడ్డిపల్లి జనరల్ మహిళకు కేటాయించగా దొడ్ల శ్రీదేవమ్మ, అప్పారావుపాళెం ఎస్టీమహిళకు కేటాయించగా సోమా కుమారి, బట్టేపాడు ఎస్సీలకు కేటాయించగా చెరుకూరు చినచెంచయ్య, మహిమలూరు ఎస్సీలకు కేటాయించగా పట్టెద చంద్రశేఖర్, రామస్వామిపల్లి బీసీ మహళకు కేటాయించగా సంపతి రమణమ్మ, ఆరవేడు జనరల్ కాగా సూరం ప్రసాద్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. కాగా ఈదపా గత ఎన్నికల్లో వచ్చిన రిజర్వేషన్లు రావు. రొటేషన్ విధానంలో ఇతర క్యాటగిరిలకు రిజర్వేషన్ ఉంటుంది. దాంతో ఆశావహులు ఈదపా తమ క్యాటగిరికి రిజర్వేషన్ అవుతుందాలేదా, ఇతర క్యాటగిరి రిజర్వేషన్ అయితే ఎవరిని పోటీలో నిలపాలి అనే చర్చలు తీవ్రంగా సాగుతున్నాయి. ఎన్నికల కమీషన్ ఎన్నికల నిర్వహణకు స్పష్టంగా ఉండడంతో చర్చలు ఆరంభమయ్యాయి. గతంలో అధికంగా వైసిపి తరపువారే గెలుపొందగా ఈదపా ఆశావహులు అధికంగా అధికారతెలుగుదేశం నుండి ఉన్నట్లుగా కన్పిస్తోంది. గతంలో ఓటమి చెందిన పలువురు కూడా ఈ దపా పోటీచేయాలని ఉవ్విళ్ళూరుతున్నట్లుగా కన్పిస్తోంది. వచ్చేనెలలో రిజర్వేషన్లు ఖరారైతే అప్పటికి ఆశావహుల్లో ఎవరు అభ్యర్థులుగా ఉంటారనేది స్పష్టంగా వెల్లడయ్యే అవకాశాలున్నాయి. అప్పటివరకు ఈ ఉత్కంఠత కొనసాగాల్సిందే. ఇక ఎన్నికలు త్వరలో రానున్నయని అధికారపార్టీలో నేతలు తామంటేతామే అభ్యర్థులుగా ఉండాలి, పదవులు పొందాలని ఉవ్విళ్ళూరుతుండగా వైసిపి మాత్రం గుంభనంగా ఉన్నట్లు కన్పిస్తోంది. జనసేన, బిజెపిలు తమకు దామాషాప్రకారం సీట్లు లభించకపోతాయా అని యోచిస్తున్నారు. మొత్తంమీద స్థానిక ఎన్నికల చర్చలు జోరందుకుంటున్నాయి.

# అక్టోబర్ 10న ఎర్రచీర పిక్చర్ విడుదల

## సినీ డైరెక్టర్ సుమన్ వెల్లడి




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** దీపావళికి వారం ముందే అక్టోబర్ 10న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న ఎర్రచీర ది బిగినింగ్ సినిమా ను ప్రతి ఒక్కరు చూడాలని డైరెక్టర్ సుమన్ బాబు కోరారు. ఆదివారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బేబి దమరి సమర్పణలో శ్రీ పద్మాయల ఎంటర్టైన్మెంట్స్ శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ఎర్రచీర – ది బిగినింగ్'. ఈ సినిమాలో నటుడు రాజేంద్రప్రసాద్ ముద్దుల మనవరాలు బేబీ సాయి తేజస్విని నటించిందన్నారు. ఎర్రచీర – ది బిగినింగ్' మూవీకి సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహిస్తూ ఒక ముఖ్య పాత్ర పోషించానని చెప్పారు. మదర్ సెంటిమెంట్, హార్రర్, యాక్షన్ కథతో ఈ సినిమా తెరకెక్కిందని పేర్కొన్నారు. ఈ సినిమాలో నటీనటులు బేబి సాయి తేజస్విని, సుమన్‌బాబు, శ్రీరామ్, కమల్ కామరాజు, కారుణ్య చౌదరి, అయ్యప్ప పి.శర్మ, సురేష్ కొండేటి, రఘుబాబు నటించారన్నారు. అంతేకాకుండా ముందుగా సినిమా బిజినెస్ షో చూసిన తర్వాత డిస్ట్రిబ్యూటర్లందరూ సినిమా అద్భుతంగా ఉందని సినిమా తీసుకునేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. సినిమా కంటెంట్ డివోషనల్ టచ్ ఉన్న కంటెంట్ కావడంతో ఈ సినిమాని దీపావళి కానుకగా విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవలే ఈ సినిమా సెన్సార్ కూడా పూర్తి చేసుకుందని సినిమా చూసిన సెన్సార్ టీమ్ చిత్ర బృందాన్ని అభినందించారు. ఇంటర్వెల్ బ్యాంగ్, క్లైమాక్స్ హైలైట్‌గా నిలిచాయన్నారు. సినిమా చూసిన వారందరూ అద్భుతంగా ఉందని కొనియాడారని అన్నారు. సినిమా ఆలస్యం కావచ్చు కానీ కంటెంట్ మాత్రం ఖతర్నాక్‌గా ఉందని చూసినవారు వెల్లడించారని పేర్కొన్నారు. హార్రర్ బ్యాక్ డ్రాప్‌లో మదర్ సెంటిమెంట్‌తో తీసిన ఈ లేడీ ఓరియేంటెడ్ సినిమా అందరూ కలిసి చూసే కుటుంబ కథా చిత్రంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ తప్పకుండా థియేటర్‌కి వచ్చి చూడాలని కోరారు. ప్రమోషన్స్ జోరు పెంచుతున్నామని, అక్టోబర్ 3న రిలీజ్ ట్రైలర్ విడుదల చేసి, అక్టోబర్ 5న విజయవాడలో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహిస్తామని తెలిపారు. 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. చిన్న సినిమాలను కూడా సినిమా హాలు యాజమాన్యం, ప్రజలు ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వ చిన్న సినిమాలకు ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో శివలంకి జనార్దన్, నెల్లూరు సినిమా అసోసియేషన్ అధ్యక్షుడు రావూరు వెంకట్ నటులు, ఎన్‌సిపి మెంబర్ మీరాకీల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

# సిమెంటురోడ్ల నిర్మాణం.. సైడుకాలువలు శూన్యం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** దశాబ్దకాలం అరిచిగీపెట్టగా సిమెంటురోడ్లు నిర్మించారు. సైడుకాలువలు ఏర్పాటు చేయలేదు. ఆకాలనీకి మురుగునీరు ఎటూవెళ్లలేని పరిస్థితి. దాంతో అనారోగ్యకరవాతావరణంలో కాలంగడుపుతుంటారు. సిమెంటు రోడ్లు ఎలాగో వేసి ఐదేళ్ళు దాటింది. సైడుకాలువలకు మరో దశాబ్దం వేచిచూడాల్సిందేనా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇది పాలకుల కక్షా, వివక్షా అని కాలనీవాసులు ప్రశ్నిస్తుంటారు. అయినా స్పందించే పరిస్థితి లేనేలేదు. ఈకాలనీ ఆత్మకూరు పట్టణానికి కూతవేటుదూరంలో ఉన్న నువ్వూరుపాడు మజరా గ్రామబస్టాండువద్దనే ఉన్న అరుంధతీయ కాలనీ. అందరూ ఎస్సీలే. ఎప్పుడు అడిగినా నిధులకొరత అంటుంటారు. ఎస్సీ,ఎస్టీ నిధులంటారు, ఉపాధిహామీ నిధులంటుంటారు. కానీ ఈకాలనీకి మాత్రం మోక్షం కలుగడంలేదు. స్వచ్ఛత, పరిశుభ్రత, వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛతయేసేవ, స్వచ్ఛభారత్, స్వచ్ఛఆంధ్రా, మన ఊరు–మనిపరిశుభ్రత, స్వచ్ఛసంకల్ప అనే అనేకపేర్లతో కార్యక్రమాలు నిర్వహిస్తుండే ప్రభుత్వం అనేకదపాలు కాలనీవాసులు అరిగిచీపెడుతున్నా. పత్రికలు ఘోషిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఈకాలనీ వాసుల ఆవేదన అంతాఇంతా కాదు. అధికారులు తమ కాలనీపట్ల కక్షచూపుతున్నారా, వివక్ష పాటిస్తున్నారా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఈకాలనీలో రోడ్లు అధ్వాన్నంగా, సైడు కాలువలు లేకుండా వారు దుర్గంధంమద్య, అసౌకర్యం మద్య జీవనం సాగిస్తుండేవారు. దశాబ్ధంపాటు అరిచిఅరిచి అలసిపోయే తరుణంలో ఏడేళ్ళక్రితం కాలనీలో సిమెంటు రోడ్లు నిర్మించారు. కానీ సైడు కాలువలుమాత్రం ఏర్పాటుచేయలేదు. దాదాపు 40కుటుంబాల ఎస్సీలు అక్కడ నివాసాలున్నారు. అప్పటికీ రోడ్ల అంచున కొంతమేరకు వారే కాలువలను త్రవ్వకున్నారు. ఈకాలనీకి తూర్పు,దక్షిణం రెండువైపులా పంటపొలాలు ఉన్నాయి. అటు మురుగునీరు వెళ్ళే పరిస్థితి లేదు. పడమరవైపు ఎత్తుగా ఉన్నందున అటుగా నీరు వెళ్ళే పరిస్థితి లేదు. ఉత్తరం వైపు ఆత్మకూరు–సోమశిల మార్గం అంచున పెద్దకాలువ ఉంది. కాలనీలో సైడు కాలువలు నిర్మించి ఆనీటిని ఉత్తరంవైపు కాలువలోకి మళ్ళిస్తే వారికి దుర్గంధం బెడద తప్పుతుంది. కాలనీలో మురుగునీరు నిల్వ ఉంటూ తరచూ జ్వరాలు సోకడం, గతంలో ఒకే ఏడు ఐదారుమందికి డెంగ్యూసోకి నెల్లూరు,చెన్నైలకు వెళ్ళి చికిత్సలు చేయించుకున్నారు. రోడ్డు అంచూన మురుగునీరు ఎటూవెళ్ళే పరిస్థితి లేని విషయం గతంలో అనేకమంది ప్రజాప్రతినిధులకు, అధికారులకు, నాయకులకు వారు విన్నవించినా ఏమాత్రం ఫలితంలేకపోయింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు, నాయకులు స్పందించి కాలనీలో పరిస్తితి పరిశీలించాలని, తగు చర్యలు తీసుకోవాలని వారంతా ముక్తకంఠంతో కోరుతున్నారు. కదలిక వస్తుందేమో చూడాల్సి ఉంది.

# డిజిటల్ బుక్ క్యూఆర్ పోస్టర్‌ను ఆవిష్కరణ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** అన్యాయానికి గురైన వైసీపీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, మేరుగ మురళి, సంజీవయ్య లతో కలిసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరుసిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి డిజిటల్ బుక్ క్యూఆర్ పోస్టర్ ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని ఇబ్బంది పెట్టిన వారిపై ఫిర్యాదు చేసేందుకు డిజిటల్ బుక్ ఒక అస్త్రమని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తమను ఇబ్బంది పెట్టిన వారిపె కార్యకర్తలు ఈ బుక్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తలు ఫిర్యాదు చేసిన వారిపై తప్పకుండా శిక్ష పడేలా చర్యలు ఉంటాయన్నారు.

## సోమిరెడ్డి సమక్షంలో 36 కుటుంబాలు టీడీపీలో చేరిక



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు మండలం పులికల్లుకి చెందిన 36 కుటుంబాల వైసీపీ కార్యకర్తలు ఆదివారం అపార్టీని వీడి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సమక్షంలో టిడిపి గూటికి చేరారు. పొదలకూరు ఆర్ అండ్ బి అతిథి గృహంలో వీరందరికీ సోమిరెడ్డి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంతోపాటు సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై తెలుగు దేశం పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయన్నారు. పులికల్లు గ్రామ నాయకులు పులిపాటి వెంకటరత్నం నాయుడు, పులిపాటి వెంకటేశ్వర్లు నాయుడుల ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వారిలో కొమ్మి శ్రీనివాసులు, ఆవుల శంకరయ్య, గంపల శ్రీనివాసులు, కూరపాటి రంగయ్య, కొమ్మి వెంకటరత్నం, సిద్ధం పెంచలయ్య, చినపెంచలయ్య, నిమ్మళ్ల నారయ్య, అంకయ్య, పెంచలయ్య, చెంచురామయ్య, ప్రసాద్, శివప్రసాద్, గుండోలు పెంచలయ్య, నిమ్మళ్ల శివకుమార్, రామయ్య, చలంచర్ల రమణమ్మ, నల్లు చెంచురామయ్య, కొమరిగిరి పెంచలయ్యలు ఉన్నారు.

## కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేయడం జరిగిందని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ, మిగతా ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరు కావడంతో ఈ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ప్రజా సమస్యలపై చర్చించుకోవాల్సిన ఈ సమావేశానికి పలుమార్లు ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి రాకపోవడంతో కోరం లేక వాయిదా వేస్తూ వస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికి 6సార్లు సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేయడంతో మండల ప్రజా ప్రతినిధులు ఇలా గైర్హాజరు కావడంతో మండలంలో ప్రజా సమస్యలు పరిస్కారం కావడం లేదని ఆయన తెలిపారు. అన్ని శాఖ అధికారులు పాల్గొన్నారు.

## తనకు న్యాయం చేయాలి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మాధవ్ ఈవెంట్ అర్గనైజర్ నటరాజ్ తనను మోసం చేశారని ఎస్.కె ఆరిఫా ఆరోపించారు. ఆదివారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మాధవ్ ఈవెంట్ అధినేత తన టీమ్ చేత మూడు సార్లు ప్రోగ్రామ్స్ చేయించుకున్న నటరాజ్ రూ. 1,50,000/- ఇవ్వాల్సి ఉన్నా, ఇప్పటివరకు కేవలం రూ. 30వేలు మాత్రమే ఇచ్చారని చెప్పారు. ఇంకా ఒక లక్ష ఇరవై వేల రూపాయలు ఇవ్వాల్సి ఉన్నా, ఎన్నిసార్లు అడిగిన చెల్లించడం లేదన్నారు. తమది మిడిల్‌క్లాస్ ఫ్యామిలీ అని, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా మాకు న్యాయం జరగడం లేదని వాపోయారు.

## చాముండేశ్వరి దేవాలయంలో నవరాత్రి పూజలు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరులోని శ్రీరామలింగ చాముండేశ్వరి దేవాలయంలో శరన్నవరాత్రి పూజలలో భాగంగా ధనలక్ష్మి అలంకారం ఏడవ రోజు అమ్మవారు.. అమ్మవారికి ఉదయాన్నే అభిషేకాలు అనంతరం సహస్రనామ, అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం లలితా సహస్రనామం పూజలు మరియు భజనలు తదుపరి కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి ఆలయంలో పుష్పాలంకరణ అత్యంత వైభవంగా చేశారు. ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కొండా సుబ్బరామిరెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

# పని ఒత్తిడిని జయించేందుకు క్రీడలు అవసరం

- క్రికెట్ టోర్నమెంట్‌ను అట్టహాసంగా ప్రారంభించిన రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి
- టీడీపీలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్‌ను అనుబంధ సంస్థగా చేర్చాలని కోరిన జిల్లా అధ్యక్షులు
- టోర్నమెంట్ లో పాల్గొన్న మూడు జిల్లాలకు సంబంధించిన ఐదు జట్లు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి, పని ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తెలియజేశారు. నెల్లూరులోని బుజబుజ నెల్లూరు క్రికెట్ స్టేడియంలో జిల్లా మెడికల్ రిప్రెసెంటేటివ్ అధ్యక్షులు బి.శివారెడ్డి ఆధ్వర్యంలో మెగా క్రికెట్ సీజన్ వన్ టోర్నమెంట్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని బ్యాట్ పట్టి సిక్స్ కొట్టి టోర్నమెంట్‌ను క్రీడాకారుల హర్షధ్వనుల మధ్య అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా ఆయన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ లేకిన్, ఎం.వేణు, సన్నీలతో కలిసి టాస్ వేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వేమిరెడ్డి క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామి రెడ్డి మాట్లాడుతూ.. మానసిక ఉల్లాసానికి, పని ఒత్తిడిని జయించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌లు ప్రతి నిత్యం పని ఒత్తిడితో బిజీ బిజీగా ఉంటారని, అలాంటి వారిని మానసికంగా దృఢత్వం చేసేందుకు క్రికెట్ టోర్నమెంట్ను ఏర్పాటు చేసిన జిల్లా అధ్యక్షులు శివారెడ్డిని ఆయన అభినందించారు. అనంతరం జిల్లా మెడికల్ రిప్రజెంటేటివ్ అధ్యక్షులు శివారెడ్డి మాట్లాడుతూ.. మూడు జిల్లాల మెడికల్ రిప్రజెంటేటివ్ ఐదు టీములుగా ఏర్పడి టోర్నమెంట్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు. మెడికల్ అసోసియేషన్‌ని టిడిపి అనుబంధ సంస్థగా చేయడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పట్టాభి రామిరెడ్డిని ఆయన కోరారు.

# పొదలకూరులో వేడుకగా మహాత్మా గాంధీ విగ్రహావిష్కరణ

## జాతిపిత విగ్రహాన్ని ఆవిష్కరించిన సోమిరెడ్డి



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు ఆర్ అండ్ బి అతిథి గృహ ఆవరణలో ఆర్యవైశ్య సోదరులు ఏర్పాటుచేసిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆదివారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడుతూ.. శాంతి, అహింస అనే ఆయుధాలతో భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. ఆయుధాలు లేకుండా శాంతి, సత్యాగ్రహం ద్వారా బ్రిటిష్ వాళ్ళ నుండి దేశాన్ని కాపాడు కోవచ్చని ప్రపంచానికి ఒక సందేశాన్ని ఇచ్చిన మహానుభావుడు గాంధీ అని అన్నారు. ఈ భూమి ఉన్నంత వరకు గాంధీజీని ఎవరూ మర్చిపోలేరని తెలిపారు. గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. పొదలకూరు పట్టణంలో మెయిన్ రోడ్డుపై ఓవైపున ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు విగ్రహం ఉంటే మరోవైపున దేశానికి స్వాతంత్రం సాధించి పెట్టిన మహానుభావుడు జాతిపిత గాంధీజీ విగ్రహం ఏర్పాటు చేసుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సోదరులు సోమిరెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు. తొలుత పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ వద్దనున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరి వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్ బాబు, ఏఎంసి చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ వెంపులూరు అరుణ, ఏఎంసీ డైరెక్టర్లు కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, అక్కెమ్ సుధాకర్ రెడ్డి, ఆర్యవైశ్య నాయకులు అమర్తలూరు చెంచయ్య, పొట్టి సుధాకర్, గుర్రం మీరా మధు, ఆకులూరు విజయ్ కుమార్, రాజా సురేంద్ర, పిన్నెల్లి ప్రభాకర్, కామేశ్వరరావు, తన్నీరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాళికామాతగా శ్రీ రాజరాజేశ్వరి అమ్మ

## అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దంపతులు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం, దుర్గామిట్టలో వేంచేసియున్న శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి శ్రీ కాళికా అలంకారం చేయుట జరిగింది. శ్రీ కాళికా అలంకారంకు ఉభయకర్తలుగా చెన్నారెడ్డి శిరీష, కుమారుడు శ్రీ చెన్నారెడ్డి సతీష్ కుమార్ రెడ్డి నెల్లూరు వారు వ్యవహరించారు అనంతరం సంపుటీకరణ చండీ హోమం జరిగింది. చండీ హోమం ఉభయకర్తలుగా సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు, భద్రావతి వ్యవహరించారు. శ్రీ సుందరేశ్వరస్వామి ఆలయము నందు శ్రీ లలితా కుంకుమార్చన/మహన్యాసంకు ఉభయకర్తలుగా మల్లు శ్రీనివాస రెడ్డి, రాధ వ్యవహారించారు. సాయంత్రం ప్రత్యేక పుష్పాలంకారమునకు ఉభయకర్తలుగా జోరేపల్లి సాయి ప్రసాద్ రెడ్డి, శ్రీలత ఇండ్లూరు వారు,



కోడూరు నిరంజన్రెడ్డి, ప్రవీణ రేబాలవారు వ్యవహరించారు. విశేష సంఖ్యలో భక్తులు ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సుజిత దంపతులు శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపించారు. దర్శనం అనంతరం వేదాశీర్వచనం పలికి శేష వస్త్రములతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించుట జరిగింది. వీరికి ఆలయ సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఈరోజు ఆలయ విమాన గోపుర, సాలాహార నిర్మాణ దాతలు ఆల్తూరి గిరీష్ కుమార్ రెడ్డి, ఆల్తూరి మహేష్ కుమార్ రెడ్డి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపినారు. ఆలయ సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి కోవూరుజనార్థన్ రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ ఏలూరు శిరీష, మిగిలిన సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# భువనేశ్వరి దేవి సన్నిధిలో సామూహిక చండీ హోమం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేటలో వెలసియున్న శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శ్రీ దేవి శరన్నవరాత్రుల సందర్భంగా ఆదివారం అమ్మవారి దర్శనానికి, ప్రదక్షిణలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయంలో ఉదయం 9 గంటలకు సామూహిక చండి హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగిందని సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

# చండిక దేవిఅలంకారంలో కామాక్షమ్మ అమ్మవారు



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంత సాగరం శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజున అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలోని శ్రీ కామాక్షి సమేత దేవాలయంలో ఆదివారం అశ్విజ శుద్ధ విద్య కామాక్షమ్మ అమ్మవారు భక్తులకు చండిక దేవిఅలంకారంలో దర్శనమిచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ శర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీ కామాక్షి సమేత అమ్మవారుకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# విద్యాలక్ష్మిదేవి అమ్మవారుగా భక్తులకు దర్శనం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని దేవరపాలెం గ్రామం వేదగిరి క్షేత్రం నరసింహకొండపై వేంచేసియున్న వేదగిరి లక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి తెలిపారు. ఈ సందర్భంగా దసరాలలో 7వ రోజు ఆదివారం ఆశ్వీయుజ శుద్ధ షష్ఠి రోజున దేవస్థాన ఉభయ కర్తృత్వంలో శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారు విద్యాలక్ష్మిదేవిగా విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా దేవస్థాన ముఖ్య అర్చకులు అర్చకం మాధవగిరి భాస్కరాచార్యులు కలశపూజ, విశేష కుంకుమార్చన శ్రీ సూక్త హోమం ఆదిలక్ష్మి అమ్మవారి ఉత్సవ మూర్తికి అభిషేకం నిర్వహించారు. విజయలక్ష్మి అలంకార సేవలో కార్యనిర్వహణాధికారి, అర్చకులు మాధవగిరి వెంకట రాఘవా చార్యులు, భక్తులు, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులందరికీ తీర్థ, ప్రసాదములు వితరణ చేశారు. భక్తులందరికీ అన్నదానం పథకంలోని అన్న ప్రసాదములు వితరణ జరిగింది. సోమవారం ఆదిలక్ష్మి అమ్మవారు సరస్వతిదేవీ అలంకారంలో దర్శనమివ్వనున్నారు.

# శ్రీ మహాలక్ష్మిగా కామాక్షితాయి అమ్మవారు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో వెలసియున్న శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం, జొన్నవాడ క్షేత్రం నందు శ్రీదేవి శరన్నవరాత్రులు సందర్భంగా ఏడవ రోజు ఆదివారం శ్రీ కామాక్షితాయి అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అమ్మవారి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పుణ్యాహవాచనం, కలశ పూజలు, రాత్రి సామూహిక కుంకుమార్చన, మహా నవావరణ పూజ నిర్వహించారు. శ్రీదేవి శరన్నవరాత్రులు సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాట నృత్య ప్రదర్శన, విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తుల సౌకర్యార్థం దర్శన క్యూలైన్లు, త్రాగునీరు, అన్నప్రసాద వితరణ, శానిటేషన్, ఉచిత వైద్య శిబిరంను సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.